# జనపదం

మన లీడరు సాబులు రొండేండ్ల నర్థం, గోసుల ఊసిపొంగ కొట్లాడి కొత్తజీతాలు పెంచుకచ్చిండ్రు. ఇగ రేపోమాపో కొత్తజీతాలు అత్తయని లేబరోళ్లంత బీరు సీసల తీరుగ బుసబుస పొంగులు పొంగుతున్నరు! బజార్ల సావుకార్లు కూడా అడిగినోనికల్లా ఉద్దెర బెదుతున్నరు. ఖాతాలు రాస్తున్నరు. గట్ల బజారంత అమ్మెటోళ్లు అమ్మంగ కొనెటోళ్లు కొనంగ వూలతోట తీరుగ కళకళలాడుతాంటె ఆకుల ఎంకటీ! నువ్వేమొ మొగడు కొట్టిన ముండతీరుగ రంధివడి కూసున్నవేందీ?" అని నేనడిగిన.

"రంథంటె నీకెట్ల చెప్పాలె వాయి! నా పెయ్యంత శిగ్గయితాంది" అన్నడు.

"అయ్యో ఇదెక్కడి కథే! నేనేమన్న పరాయోన్నా చెప్పరాదు అని నేనంటె, "రేపు బాయి (బొగ్గు గని) మీదికి బొయ్యి కొత్తజీతం ఏమిట్ల తెచ్చుడా అని వారం పది దినాల్నుంచి ఆలోశించుతాన. సించుతాంటె అది ఎటు తెగుతలేదు. మునుపటి తీరుగ అంగి జేబుల్ల, లాగు జేబుల్ల తెచ్చుకోను వశంగాదట కద గందుకని దుకాండ్లకు బోయి బందవస్తు సూట్‌కేస్ కొందునా లేకపోతె మేదరి బస్తికిపోయి రొండు పెద్ద గంపలు అల్లిత్తునా అని సూత్తాన. ఎంట బాయి మీదికి మీ అక్కను కూడా తీసుకపోవాల్సి అత్తదా మోసుకరావటానికి."

మునుపు మూడు ఏజి బోర్డులను ఇవుతలకి గుంజుకచ్చేటాళ్లకే లీడరు సాబులకు దమ్ము మొసచ్చె! అట్ల 'కోడి కూరుకు' తీరుగ వన్నరో లేదో— ఎడ్డోనికి దేనిమీదనో లోకం అన్నట్టు—లేబరోళ్లంత 'నాలుగో ఏజి బోర్డని' రాగాలు దీసిరి. తిత్తె తీసిండ్రు మన్న కాడ్రమేళ్లు గింతే లెమ్మని సప్పుడు చేయకపంటె లేపిరి. లీడర్ల మొఖాలు కడిగిరి. గోసులు బిగిచ్చిరి. కత్తులు కటార్లు నూరిచ్చిరి. ఇగ పొయ్యి సర్కారుతో కొట్లాడి ఏజి బోర్డును తెంపుకరాండ్రి అని నిలువ నియ్యకుంట సెవునిల్లు గట్టుకుని పోరిరి.

అట్ల లీడరు సాబులు బైలెల్లి వాళ్ల దాంట్ల వాళ్లు కొట్లాడి, అక్కడికి ఢిల్లికి బోయి రాజీవగాంధితోటి లరాయి చేసిరి. అటు తిప్పలవడి ఇటు తిప్పలవడి 'ఏజి బోర్డు దండెడ' నాలుగు పురులు తెంపిరి. ఇగ తల్లి పురి ఆగింది. దాన్ని తెంపుటానికి కూడా అటు రాజీవ్‌గాంధీ, ఇటు లీడరు సాబులు పట్టి గుంజు మీద ? గుంజుతనే వున్నరు. ఇంతట్లకే లేబరోళ్లకు పానం ఆగలేదు. కచ్చాపచ్చా తినే లేకిడి రకంగదా! అయిపెయిందిర పిలగాండ్లా అంటె ఇనకపెయిరి. ఇనక ఏన్నో మూలకు ముసుకేసుక వన్న అన్నలను లేపిరి. ఆ యింత అన్నలు లేడికి లేసిందే పరుగన్నట్టుగ 'అరరాని' లరాయిల దునికిరి. దునుకంగనే ఏజి బోర్డు దండెడ పుటుక్కున తెగి అటు రాజీవ్‌గాంధి, ఇటు లీడరు సాబులు పడిపోయిరి. ఆయినుగూడిందీ, మీసం దువ్విందీ ఒక్కటే అయింది. వీళ్లదేం గొప్ప! రొండేండ్ల నర్థం కొట్లాడి నాలుగు పురులు తెంపినోళ్లు ఆయింత తల్లి పురిని తెంపలేకపోదురా? వీళ్ల మాటలు గని రొండెండ్ల నర్థం గడుత్తేంది ఆయింత యాడాది నర్థం గడిత్తేంది?

సరె! కాగల కార్యం గంధర్వులు చేసిండ్రు అని అటు రాజీవ్‌గాంధీ, ఇటు లీడరు సాబులు కొత్త జీతాలు ఎప్పట్నుంచి కొలుసుదు అనుకున్నరు. రాజీవ్‌గాంధీ రైలు వాగిన్ల మీద నింపి పంపిస్తనంటె లీడరు సాబులు వద్దన్నరట. 'దయ్య దేశం కాలం మంచిగలేదు. గంగ నిండుగనే అత్తాందికద రూపాలన్ని అండ్ల జారిదువు ఈడమేం తోడెండ్లు,వలలు, మావులు పెట్టుకోని దేవుకుంటం అన్నరట. గట్ల




నైతె పక్కాగా అందుతయన్నరట.' స! మీ మాటను నేనెప్పుడు కాదన్న గట్లనే పంపిస్తపో అన్నడట.

గట్ల పైసలు పంపుటానికి గవాళ్లకే గంత తిప్పల అయితె తెచ్చుకునుటానికి మనకెంత తిప్పలు గావాలె? గదిర పిలగ నేను రంధితోటి వున్న సంగతి అని ఎంకటి అన్నడు. అంటె—

'ఎంకటీ' అని పిలిస్తె వాయి! అన్నడు. రొండు తల్కాయల పాము అటు ఆరునెల్లు నడుత్తదట ఇటు ఆరునెల్లు నడుత్తదట. కనివాయి! నువ్వేటు మాట్లాడ్తానవో తెలుస్తలేదు. నువద్దే పెరిగినయి కొత్త జీతాలు అంటానవా? లేదు పెరుగలేదు అంటానవా? బజార్ల సూత్తె ధరలు సుక్కల పర్వతం మీద కూసున్నయి. లేనిముండకన్న గుడ్డి ముండనయమన్నట్టు ఆలస్యంగనో ఎట్లనో కొత్త జీతాలు వత్తానయి గదాని అందరు సంబురవడ్తున్నరు. "అమ్మమ్మా నీ ఉవ్వ మందులకు కావాల్నంటె చింత కొమ్మలెక్కి చిమ్మిచ్చి పోసినట్టు" పెరిగిందని చెప్తున్నవా? పెరుగలేదని? కస తెల దగ్గరాదో పిలగా అని నేనన్న. తెల దగ్గాల్నా అన్నడు! దగ్గో అన్న. అప్పుడ వాడు నా ఎనుకపక్క తిరిగి నా నడుం కింది భాగాన ఒక్క తన్ను తన్నిండు.

'ఇదేంది వదినే! తన్నువల్సి నోళ్లను ఇడిసిపెట్టి నన్ను తన్నువడ్తివి. కనీసం ఫిట్ లెవల్ (బావి మీద) లీడర్ను కూడా కాదు' అని నేనంటె ఏజి బోర్డుల కొత్త జీతాలు పెరిగినయో లేదో ఇప్పుడన్న తెలుస్త లేదా అన్నడు. లేదు అన్న. తన్నినంక కూడా తెలుస్త లేదా అన్నడు. నాకు అనుమానమచ్చింది.

పోశెట్టీ వినూ అన్నడు. వింటాన అని నేనన్న. "ఏమీ లేదోయ్. వేజ్ బోర్డంటె పెద్ద మాయ" అన్నడు. నాడుజీతం నాలుగు వందలన్నడు. బియ్యం కిల రూపాయన్నడు. గోదుమలు అర్థ పైసలు. పప్పు రూపాయి పావుల. మంచినూనె కిలో మూడు రూపాయలు. నూరు చెప్పెడెందుకు పోశెట్టీ రొండున్నరకు అల్లర్జ బరండి పవ్వ అచ్చేది అన్నడు. అబ్బో నీ బాంచెనైదు గది బంగారి కాలమే అయితె అని నేనన్న.

"నేడెట్ల ఉన్నదో" అన్నడు. "అది గూడ నువ్వే చెప్పు" అన్న. 'గంపగుత్తన సూసుకుంటె నెలకు పదారు వందలు రాకపాయె. బజాట్ల ధరలు సూత్తె కండ్లకు దుఃఖమచ్చె. కిలో బియ్యం ఆరు రూపాయలాయె! కిల నూనె ముప్పయ్ రూపాయలాయె. పప్పుధర లెక్కేలేదాయె. సీసల లెక్కన చెప్తె నీకు జెల్ది అర్థమైతది వాయి! బరండి పవ్వకు ఇరువైదాక అచ్చె' అంటె 'రైటో' అన్న.

'ఇగ పెరిగింది పెరిగిందీ అంటె పెరిగిందేందో తరిగిందో కనిపిస్తలేదా పోశెట్టీ' అన్నడు. 'జీతాలు నక్కల తీరుగుంటె ధరలు నాగలోకం తీరుగుంటయి' అన్నడు. 'ఏటికేడు చేసిచేసి లేబరోని నెత్తం నెత్తురు అయిపోతాంది. లీడరు సాబులేమొ పెరిగినయి పెరిగినయ్ అంటున్నరు. ఎనుక జేబుల నుంచి తీసి ముంగటి జేబుల పెడుతున్నరు. ఈతాకు మనకిచ్చి తాటాకు దొబ్బుతున్నరు.

చేళ్ బంచోత్ పోశెట్టీ' అన్నడు.

'శెనార్తి బావ చెప్పు' అన్న.

'ఏజి బోర్డంటె ఏంలేదు పెద్ద మాయ' అన్నడు. 'ఏజి బోర్డంటె పంచపాండువలు మంచం కోళ్ల తీరుగ మూడూ అని రెండేళ్లు మాయించినట్టు' అన్నడు.

ఇశ్వరూపం చూసిన అర్జునుని తీరుగ అనిపిచ్చింది నాకు. ○

—— కైతికాల పోశెట్టి ——